క్లుప్తంగా

గణపతి దేవునికి క్షీరాభిషేకం



రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని ధన్వంతరీ విద్యా లక్ష్మి గణపతి దేవాలయంలో స్వామి వారికి క్షీరాభిషేకం, గంధాభిషేకం శుక్రవారం చేశారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని, ఆలయ అర్చకులు బూరగాపు అనంతలింగం ఆధ్వర్యంలో ఈ పూజలు చేపట్టారు. అనతరం గరికపూజ, విశేష హారతి కార్యక్రమాలు నిర్వహించారు.

సచివాలయాలను తనిఖీ చేసిన చైర్మన్

బొబ్బిలి: పట్టణంలోని 5,6 సచివాలయాలను మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్, ఫిర్యాదుల రిజిస్టర్లను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. నిత్యం వార్డుల్లో తిరగాలని సిబ్బందికి సూచించారు. ప్రజల వినతులు, సంక్షేమ పథకాల దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ఆధ్యాత్మిక సభ

రేగిడి: మండల కేంద్రంలోని దత్తపీఠంలో ఆధ్మాత్మిక సభ శుక్రవారం నిర్వహించారు. పౌర్ణమి పురస్కరించుకుని, చేపట్టిన ఈ సభలో ఆధ్యాత్మిక గురువులు కిమిడి సత్యనారాయణ నాయుడు, జడ్డు జగ్గారావు, పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ పాల్గొని, మోక్ష మార్గం పొందేందుకు భక్తులు ఆచరించాల్సిన నియమాలు వివరించారు. పుణ్యతీర్థాలు, క్షేత్రాలు సత్సంగానికి సాటి రావన్నారు. ఎక్కడైతే సత్సంగం జరుగుతుందో అక్కడే ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందన్నారు. గురువులు చెప్పిన విషయాలను తూ.చ తప్పకుండా పాటించి, సన్మార్గంలో నడవాలని కోరారు. అనంతరం దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాష్టారు ఆధ్వర్యంలో దత్త పాదుకా పూజ, గణపతి హోమం, ఆధ్యాత్మికవేత్తలకు సత్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో దామోదరరావు, బాబూరావు, సంకీర్తనానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి

బొబ్బిలి: ఈ నెల 14న చేపట్టనున్న హనుమాన్ జన్మదిన శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు చెలికాని కేశవ పిలుపునిచ్చారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శోభాయాత్ర సందర్భంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద గల ఆంజనేయస్వామి ఆలయం నుంచి పురవీధుల గుండా పాత బొబ్బిలి హనుమాన్ జంక్షన్ వరకు బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పెద్దింటి మనోజ్, ముగడ అనిల్, పెంట స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై కేసు నమోదు

రాజాం సిటీ: నడిరోడ్డుపై అర్ధరాత్రి సమయంలో వీరంగం సృష్టిస్తున్న పలువురు ఆకతాయిలపై శుక్రవారం కేసు నమోదు చేశామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. ఈ నెల 4వ తేదీన స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో కొంతమంది యువకులు కారును రోడ్డుపై నిలిపివేశారు. అనంతరం పెద్దపెద్ద సౌండ్స్‌తో పాటలు వింటూ రోడ్డుపై వికృత చేష్టలకు పాల్పడి ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులకు గురిచేసిన విషయం విదితమే. అయితే వారిని సీసీ పుటేజీ ఆధారంగా తెలుసుకుని, వారిపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు. వారిలో ముగ్గురు వ్యక్తులు మద్యం తాగి, ఆకతాయి పనులకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సచివాలయ మహిళా పోలీసులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. మండలంలోని చాటాయవలస అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆ గ్రామ సచివాలయ మహిళా పోలీసులు కేంద్రం నిర్వహణ, అక్కడి లబ్ధిదారులకు అందజేస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. మెనూ ప్రకారం కేంద్రానికి వచ్చే చిన్నారులకు భోజనం అందించాలని, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం క్రమం తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు.

తప్పిపోయిన విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత

రాజాం సిటీ: మండలంలోని నందబలగ పంచాయతీ, లక్ష్మీపురానికి చెందిన తాడ్డి సాయికృష్ణ అనే పదో తరగతి విద్యార్థి ఈ నెల 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయిన విషయం విదితమే. విద్యార్థి చిన్నాన్న రామచంద్రారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి, శుక్రవారం అతడిని పట్టుకున్నారు. స్థానిక బస్టాండ్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వైపు వస్తున్న అతడిని హెచ్‌సీ వైకుంఠరావు గుర్తించి, ఎస్‌ఐ రవికిరణ్‌కు తెలియజేశారు. వీరిరువురు విద్యార్థిని పట్టుకుని వివరాలు ఆరాతీయగా, తాను ఇంటర్మీడియట్‌లో జాయిన్ అయ్యేందుకు విశాఖపట్నం వెళ్లిపోయానని, ఫలితాలు వాయిదాపడ్డాయని తెలుసుకుని, వచ్చేశానని తెలిపాడన్నారు. ఈ విషయాన్ని కుటుంబీకులకు తెలియజేయడంతో వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా, వారికి విద్యార్థిని అప్పగించామని ఎస్‌ఐ తెలిపారు. పదో తరగతి ఫలితాలు కూడా వెలువడనున్న నేపథ్యంలో పరీక్ష తప్పిన విద్యార్థులు ఎటువంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని ఎస్‌ఐ సూచించారు.

సంక్షేమ పథకాలతో అభివృద్ధి..

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభిస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తెర్లాం:చుక్కవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని వి.చిన్నయ్యపేట పంచాయతీ పరిధిలోని చుక్కవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారని, అన్నివర్గాల ప్రజలను ఆదుకొనేందుకు సీఎం అహర్నిషలు కృషి చేస్తున్నారని తెలిపారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బొబ్బిలి, తెర్లాం మండలాల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల నాయుడు, నర్సుపల్లి బాబ్జీరావు, ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు గర్భాపు లూర్థు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బోను అప్పలనాయుడు, గర్బాపు రామారావు, మర్రాపు జగన్నాథం, తెంటు సత్యంనాయుడు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, వి.చిన్నయ్యపేట, పాముల వలస సర్పంచ్‌లు చప్ప రాము, రాధ ఈశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు ఆదినారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల భవనాలు ప్రారంభం

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. చుక్కవలస గ్రామంలో రూ.39.30లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందిస్తున్నట్లు చెప్పారు. పంటలకు మద్దతు ధర కల్పిస్తూ, ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తున్నామన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలు చేస్తోందని తెలిపారు. ఇంటి ముంగిటే వైద్య సేవలు అందించడం ఒక్క మన రాష్ట్రంలోనే జరుగుతోందని, ఇదంతా జగనన్న గొప్పతనమని కొనియాడారు.

ఈకేవైసీ వేగవంతం

- తహసీల్దార్ రాజేశ్వరరావు



ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ డోల రాజేశ్వరరావు

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా రైతులకు ఇవ్వాల్సిన పట్టాదారు పాస్ పుస్తకాలకు సంబంధించి ఈకేవైసీ వేగవంతం చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని వి.చిన్నయ్యపేట పంచాయతీ చుక్కవలసలో ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాసుపుస్తకాల కోసం పట్టాదారులంతా తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఆర్‌ఐ ఎం.కృష్ణమూర్తి, వీఆర్‌ఓ గణపతి, తదితరులు పాల్గొన్నారు.

104 వాహన సేవలు సద్వినియోగం చేసుకోవాలి

వంగర: గ్రామీణుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా గ్రామ గ్రామానికి వస్తున్న 104 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు సుష్మిత దయాన్ కోరారు. శుక్రవారం మండలంలోని ఎం.సీతాపురం, మద్దివలస గ్రామాలకు 104 వాహనం ద్వారా వెళ్లి, పలువురికి ఆమె వైద్యసేవలందించారు. బీపీ, సుగర్, రక్తహీనత వంటి ఆరోగ్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం: స్థానిక పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం చేపడుతున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రోడ్డు విస్తరణ పనులకు రూ.20 కోట్లు మంజూరయ్యాయని, గాయత్రీకాలనీ రోడ్డు నుంచి బొబ్బిలి రోడ్డు జంక్షన్ వరకు, ఆ తర్వాత అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకు చేపడతామన్నారు.

విత్తనాలు, ఎరువుల సరఫరాకు ముందస్తు ప్రణాళికలు



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు రామారావు, తదితరులు

బాడంగి: మండలంలోని రైతులందరికీ ఖరీఫ్ సీజన్‌కు అవసమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్బీకేలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు ఏమేరకు విత్తనాలు, ఎరువులు అవసరమో గుర్తించి ఇండెంట్ పెట్టాలన్నారు. ఏఓ శిరీష మాట్లాడుతూ, పీఎం కిసాన్ 14 విడత ఆర్థికసహాయం పొందాలంటే ఈనెల 15వ తేదీలోగా ఈకేవైసీ చేసుకోవాలని కోరారు. కౌలు రైతులు వీఆర్‌ఓల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆర్బీకే సిబ్బందిని సంప్రదించాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం



రాజాం సిటీ: మహిళా సంఘాల సభ్యులకు పెరటికోళ్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రాజాం సిటీ: మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు పెరటి కోళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలంతా ఆర్థికశక్తిగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సహిస్తోందన్నారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా స్వయంశక్తి సంఘాల మహిళలు జీవనోపాధి మరింతగా మెరుగుపర్చుకోవాలన్నారు. మదర్ పౌల్ట్రీ యూనిట్ ఏర్పాటుపై ఆసక్తి ఉన్న వారికి స్త్రీనిధి, సీఐఎఫ్ ద్వారా రుణాలు కూడా మంజూరు చేయనున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సామంతుల అరుణ, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, పశుసంవర్ధక శాఖ ఏడీ బొత్స జయప్రకాష్, ఏపీఎంలు టి.దదికుమార్, హేమలత, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక వైకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు 35 యూనిట్ల పెరటికోళ్లను జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఏపీఎం సీతారాం మాట్లాడుతూ ఒక్కో యూనిట్ ఖరీదు రూ.2,700 అని ఒక్కో యూనిట్‌లో పదికోళ్లు ఉంటాయన్నారు. వీటి పెంపకం ద్వారా స్వయం ఉపాధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంగ్రేటి కేసరి, ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



పాఠశాల అదనపు తరగతుల భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. శుక్రవారం మండలంలోని శివ్వాం గ్రామంలో దాదాపు రూ.35 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అదనపు తరగతుల భవనాన్ని ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

సంక్షిప్తంగా...

ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేత

సంతకవిటి: విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని కొండగూడేం గ్రామానికి చెందిన అక్కరపోతు అప్పలనారాయణమ్మకు వలంటీర్ గొర్లె గణపతి పెన్షన్ అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి, మరీ పెన్షన్ అందజేయడం పట్ల ఆమెతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, సర్పంచ్ కె.వెంకటప్పలనాయుడు, ఎంపీటీసీ కె.అప్పారావు వలంటీర్‌ను అభినందించారు.

గొర్లె సీతారాంపురం రోడ్డు బాగు చేయాలి

బొబ్బిలి: మండలంలోని గొర్లె సీతారాంపురం రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిత్యం రద్దీగా ఉండే రహదారి మధ్యలో గోతులేర్పడి వర్షాలకు మరింత పాడవుతోందన్నారు. వెంటనే అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి. శంకరరావు, ఎం. శ్రీనివాసరావు, ఎస్. గోపాలం, ముచ్చల శ్రీనివాసరావు, తదితరులున్నారు.

శేషగిరి మాస్టారు పోరాటాలు మరువలేనివి

బొబ్బిలి: విద్యారంగ పరిరక్షణకు శేషగిరి మాస్టారు చేసిన పోరాటాలు మరువలేనివని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పాట్నూరు శంకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శేషగిరి మాస్టారు వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోపాలం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎస్. శివ, కె. మణికుమార్, బి. తేజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు కన్వర్జింగ్, సఖి సమావేశాలు

మెంటాడ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సఖి, అలాగే అన్ని శాఖల అధికారులతో కన్వర్జింగ్ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

క్రీడాసామగ్రి వితరణ

సంతకవిటి: మండలంలోని సిరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి క్రీడాశిక్షణ శిబిరానికి అదే గ్రామానికి చెందిన మందుల నాగేశ్వరరావు జ్ఞాపకార్థ దాదాపు రూ.4 వేల విలువైన క్రీడా సామగ్రిని కుటుంబ సభ్యులు రామచంద్రరావు, రాఘవి శుక్రవారం అందజేశారు. అనంతరం క్రీడాకారులకు ఉడకబెట్టిన గుడ్లు, నువ్వులచక్కీలు పంచిపెట్టారు. ఓ షటిల్ బ్యాడ్మింటన్ నెట్, మరో బ్యారెల్ షటిల్ కాకులు, 4 షటిల్ బ్యాడ్మింటన్ రాకెట్లు అందించినట్లు పీడీఓ సన్నిబాబు తెలిపారు.

ఘనంగా ఆలయ పునఃప్రారంభోత్సవం

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామంలో లక్ష్మీ పట్టాభితల్లి ఆలయ పునఃప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పీసపాటి శ్రీనివాసరావుశర్మ ఆధ్వర్యంలో సర్వదేవతా పూజలు, మూలమంత్ర హోమాలు, శాంతి కల్యాణ, సామ్రాజ్యపట్టాభిషేక కార్యక్రమాలు జరిపారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

56 మందికి ఆరోగ్య పరీక్షలు

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో దాదాపు 56 మందికి వైద్యాధికారి సునీల్ కుమార్ ఆరోగ్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. మోకాలినొప్పులు, కీళ్లవాతం, రక్తపోటు, మధుమేహం, చర్మవ్యాధులు, జలుబు, దగ్గు, ఆయాసం వంటి వాటికి మందులు అందజేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

ఆమిటిలో పారిశుధ్య పనులు

తెర్లాం: మండలంలోని ఆమిటిలో ఇటీవల గ్రామదేవత పైడితల్లి పండుగ ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. దీంతో శుక్రవారం నుంచి గ్రామంలో పారిశుధ్య పనులు ప్రారంభించారు. ఎక్కడబడితే అక్కడ చెత్త,చెదారాలు పేరుకుపోవడంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించడంతో పంచాయతీ కార్యదర్శి చింతల సత్యనారాయణ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు.

సకాలంలో ఇళ్ల నిర్మాణాల పూర్తి

రాజాం: సకాలంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని వార్డు సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశమైన ఆయన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ నెలాఖరు నాటికి పట్టణంలో 132 ఇళ్లను పూర్తి చేసేందుకు లక్ష్యంగా చేసుకున్నామని, దాని సాధన దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

సంతకవిటి: మండలంలోని చిన్నయ్యపేటలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా వేదపండితులు పులఖండం శ్రీధర్ శర్మ, రంప కోదండరామ శర్మల ఆధ్వర్యంలో శుక్రవారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఇదే కార్యక్రమానికి హాజరైన జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు అభయాంజనేయస్వామిని దర్శించుకుని, విశేష పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణ పరిధిలోని ఇందిరమ్మకాలనీ, లచ్చయ్యపేట–1 సచివాలయ పరిధిలో ఉన్న చిన్నచెరువుగట్టు, ఆంజనేయపురం, మేదరవీధి, లచ్చయ్యపేట గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం కల్పించాలన్నదే ఆయన ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా ఆయన అమలు చేస్తున్న పథకాలతో గడప గడపలో సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయన్నారు. గతంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా, పథకం కావాలన్నా టీడీపీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అలా ప్రజలు కష్టాలు పడకూడదనే గ్రామాల్లోకి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థతో ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఘనత జగనన్న సర్కారుకే దక్కుతుందన్నారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మళ్లీ సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, నాయకులు మజ్జి రమణ, కొల్ల రమ్య, జినగం ఈశ్వరరావు, నల్లా శ్రీనివాసరావు, చల్లా జయరాం, వంజరాపు విజయ్‌కుమార్, శాసపు వేణుగోపాలనాయుడు, కలమట శంకర్, సలాది తులసీరావు, ఆసపు సూర్యం, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ బొల్లా లలితకుమారి, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేయండి..

- ఎమ్మెల్యే శంబంగి



వ్యవసాయ శాఖ ఎ.డి శ్యామ్‌సుందర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు వాతావరణం ముందుగానే అనుకూలిస్తున్నందున వరి విత్తనాలు, ఎరువులకు సంబంధించి ఆర్బీకేల్లో రైతుల పేర్లు నమోదు చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎం. శ్యామ్‌సుందరరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయాధికారులు ఈ ఏడాది సోనామసూరి, సాంబమసూరి, శ్రీకాకుళం సన్నాలు, ఎంటీయూ 1064, 1121, స్వర్ణ రకాలతో పాటు కొత్తగా ఎంటీయూ1316, సంపద రకాలను తీసుకువస్తున్నారన్నారు. ఇందులో ఏయే రకాలు మన భూములకు అనుకూలమో రైతులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం దేవదాయశాఖ జిల్లా అధికారితో ఫోన్‌లో మాట్లాడుతూ, పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద గల ఆంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధికి రూ. 40 లక్షల నిధులు మంజూరైతే ఈఓ మోకాలడ్డుతున్నాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే టెండర్ ప్రకటన ఒక పత్రికకు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. వెంటనే ఈఓపై చర్యలు తీసుకోవాలన్నారు.

హద్దు రాళ్లను త్వరితగతిన వేయాలి



గజరాయునివలసలో సర్వే రాళ్ల ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న ఎస్‌డీసీ సుదర్శనదొర

బాడంగి: ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాలలో సరిహద్దు రాళ్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్‌దొర అన్నారు. మండలంలోని గజరాయునివలస, జీకేఆర్ పురం, రామచంద్రాపురంలలో సర్వేరాళ్ల ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి.ఈ మేరకు ఎస్‌బీడీ సుదర్శనదొర గజరాయునివలసో శుక్రవారం పర్యటించి, పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో సుమారు 23 గ్రామాలలో రీసర్వే పనులు పూర్తి కాగా, వీటికి అవసరమైన సుమారు 30 వేల సరిహద్దు రాళ్లు కేటాయించగా ఇప్పటివరకు సుమారు 20 వేల రాళ్లు పాతిపెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయనతో పాటు డీఐఎస్ నారాయణ రావు, సర్వేబృందం, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

అన్ని గ్రూపులకూ పనులు కల్పించాల్సిందే..



చినభీమవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వేతనదారుల నిరసన

బాడంగి: మండలంలోని చినభీమవరంలో తొమ్మిది శ్రమశక్తి సంఘాలుండగా.. కేవలం రెండు గ్రూపుల వారికి మాత్రమే పనికల్పించి మిగిలిన వారికి అన్యాయం చేస్తున్నారని సీఐటీయూ నాయకుడు సురేష్ ఆరోపించారు. చినభీమవరంలో శుక్రవారం పర్యటించి వేతనదారులతో మాట్లాడగా.. ఈ విషయం తెలిసిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారంలో ఆరు రోజులు పనిచేస్తే నాలుగు రోజులకే మస్తర్లు వేస్తున్నారని ఆరోపించారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్ల మధ్య సమన్వయలోపంతో వేతనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి అన్ని గ్రూపుల వారికీ పనులు కల్పించాలని కోరారు.

వేసవి సెలవుల్లో పనులు పూర్తి చేయాలి

- ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న తెర్లాం ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత 'మనబడి నాడు-నేడు' పథకం పనులను వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంఈఓ త్రినాథరావు అధ్యక్షతన హెచ్ఎంలు, సీఆర్పీలు, ఎస్ఎస్ఏ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ, రెండోవిడత నాడు – నేడు పథకం కింద ఎంపికైన అన్ని పాఠశాలల్లో పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. నాడు–నేడు పనులను మండల ఎస్ఎస్ఏ ఇంజినీరింగ్ అధికారితో పాటు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్పీలు నిరంతరం పర్యవేక్షణ చేయాలలన్నారు. ఎంఈఓ త్రినాథరావు మాట్లాడుతూ, జగనన్న విద్యాకానుక కిట్లు మండలానికి వచ్చాయని, పాఠశాలల ప్రారంభించే రోజు నాటికి అన్ని పాఠశాలలకు జేవీకే కిట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. వేసవి సెలవుల్లో అమలు చేస్తున్న వియ్ లవ్ రీడింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్ఎస్ఏ ఏఈ ఎస్.రవికుమార్, సీఆర్పీలు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

బొబ్బిలి: పట్టణంలోని గ్రోత్ సెంటర్ వద్ద ఎస్ఈబీ సీఐ ఆర్. జైభీమ్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి నివారణే ధ్యేయంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.